ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ముషీరాబాద్: వాకర్స్ ఇంటర్నేషనల్, మాతావా కర్స్ క్లబ్ నల్లకుంట, అచ్చుతరెడ్డి మార్గ్ రెసిడెన్షి యల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, దంతవైద్య శిబిరం నిర్వహించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించగా సుధాకర్ పైప్స్ ఎండీ, వాసవి క్లబ్ హైదరాబాద్ అధ్యక్షులు అనంతుల దయాకర్, ముఠా జైసింహ, వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు వి.నాగభూషణం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గుండె సంబంధిత వ్యాధులతో పాటు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. మాతా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ వై.మురళీధరుడు, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కోశాధికారి కోనేరు జైహింద్ పాల్గొన్నారు.

ఉచిత చేప పిల్లల స్కీమ్‌ను కొనసాగించాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఘం సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ఉచిత చేప పిల్లల స్కీమ్‌ను కొనసాగించాలని, మత్స్య సొసైటీల అకౌంట్లలో నగదును వెంటనే జమ చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నేటికి మత్స్య వృత్తిపై ఆధారపడి సుమారు పది లక్షల మత్స్య కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకొని తొమ్మిదేళ్లు దాటినా మత్స్యకారుల జీవితాల్లో ఎలాంటి మార్పులు రాలేదన్నారు. ఆగస్టు 29,30,31 తేదీల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో రాష్ట్రస్థాయి చైతన్య సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొరెంకల నర్సింహ్మ, కొప్పు పద్మ, ముఠా విజయ్ పాల్గొన్నారు.

పార్కు వేళలపై తప్పుడు ప్రచారం తగదు

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ ఎస్ఆర్‌టీ పార్కును ప్రతి రోజు వందలాది మంది ప్రజలు ఉపయోగించుకుంటున్నారని ఎస్ఆర్‌టీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.విజయరావు తెలిపారు. గురువారం కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాలనీ ప్రతినిధులు అబ్రహం, పి.సి.ఈ.రాణి, వినయ్, జోయల్ తదితరులతో కలిసి మాట్లాడారు. పార్కు ప్రజలకు ఉపయోగపడకుండా తాళాలు వేసి ఉంచుతున్నారు అని కొంత మంది చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు పార్కు తెరిచి ఉంటుందన్నారు. కాలనీ వాసులు కాకుండా పక్కన ఉన్న కాలనీ వాసులు కొంత మంది పార్కును 24 గంటలు తెరిచి ఉంచాలని కోరుతున్నారని దాన్ని వల్ల పార్కు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతుందన్నారు. దీనికి అంగీకరించకపోవడంతో లేనిపోని ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

పార్కుల అభివృద్ధికి కృషి



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అధికారులు

చిక్కడపల్లి: పార్కుల అభివృద్ధికి కృషిచేస్తున్నామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. గురువారం డివిజన్‌లోని ఆయా పార్కులను జీహెచ్‌ఎంసీ ఉద్యానవనశాఖ ఏఈ భాస్కర్‌తో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిలిచిపోయిన పార్కు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సురభిపార్కు సుందరీకరణ ఆలస్యం కావడం పట్ల ఏఈని ఆమె ప్రశ్నించారు.

సహారా ఇండియా బాధితులను ఆదుకోండి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సహారా ఇండియా బాధితులు

కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేసిన బాధితులు

కాచిగూడ: సహారా ఇండియా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని సహార ఇండియా పరివార్ జంటనగరాల ఇన్‌చార్జులు రవీందర్‌రావు, ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో సహారా గ్రూప్‌నకు చెందిన ఉద్యోగులు, బాధితులు గురువారం కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డిని బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. సహారా గ్రూప్‌నకు చెందిన రూ.25 వేల కోట్లు సెబీ దగ్గర ఉండటంతో తమకు రావాల్సిన వేతనాలు, బకాయిలు రావడం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి, సమస్యను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చూడాలని వారు కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. జంటనగరాల రీజియన్ పరిధిలోని ఖాతాదారులు, ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని కంపెనీ నుంచి రావాల్సిన డబ్బులు వచ్చే విధంగా చూడాలని కోరారు. సహారా ఇండియా పరివార్ ఖాతాదారులు పొదుపు చేసుకున్న నగదును వెంటనే ఖాతాదారులకు అందజేసే విధంగా వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్‌ఎం షేక్ సోను సాహెబ్, సికింద్రాబాద్ ఆర్‌ఎం శ్రీనివాస్, సత్యనారాయణ, రాములు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ముదిగొండ భవానీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజలు జనాభా నియంత్రణపై అవగాహన పెంచుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అంబేడ్కర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్ అన్నారు. గురువారం అంబేడ్కర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్–1,2,3 ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రిషికాంత్ జనాభా పెరుగుదల, ఆహార ఉత్పత్తి వాటి సద్వినియోగంపై ప్రసంగించారు. డాక్టర్ ముదిగొండ భవానీ మాట్లాడుతూ జనాభా నిష్పత్తులను, జనాభా పెరుగుదల రేటు, మరణాల రేట్లను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కవిత, అన్నపూర్ణ, వైస్ ప్రిన్సిపల్ ఎస్.కుమారస్వామి, డాక్టర్ బండ్ల శ్రీధర్, పి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

సుద్దాల హనుమంతు ప్రజా పాట సభను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భూపతివెంకటేశ్వర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజాపాటకు పరిపరి దండాలు పేరుతో ప్రజాకవి సుద్దాల హనుమంతు సాహిత్యం–జీవితం సమగ్ర రచన పుస్తకావిష్కరణ, సంస్కృతిక ఉత్సవాలను ఈ నెల 16న సాయంత్రం 5 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం కన్వీనర్ భూపతివెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సుద్దాల హన్మంతు ప్రజా పాట ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలకు సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రముఖ సినీనటుడు ఉత్తేజ్, ప్రజాగాయని విమలక్క, ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- జాగ్రత్తలు పాటించకుంటే అనారోగ్యం
- వైద్యుల సలహాలు పాటించడం ఉత్తమం
- నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ప్రొఫెసర్ డాక్టర్ అనిల్





నల్లకుంట: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సరైన జాగ్రత్తలు పాటించకుంటే రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ రోగనిరోధక శక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండడం వల్ల పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. రోజువారి పోషకాలతో కూడిన ఆహారం శరీరానికి అవసరమైన మోతాదులో తీసుకుంటే ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చు. ఆరోగ్యం కాపాడుకోవడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లను నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ వివరించారు.

వీటికి దూరంగా ఉండడం శ్రేయస్కరం..

నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలు తీసుకోకూడదు. బయట దొరికే రెడీమేడ్ ఆహారం, ఉప్పుతో కూడిన ఆహారం, కూల్ డ్రింక్స్, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం ఉత్తమం.

రోజు వారీ ఆహారం ఇలా..

ఉదయం రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల గింజ ధాన్యాలు లేదా 25 గ్రాముల పప్పులు, 150 మిల్లీ లీటర్ల పాలు తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో ఏదో ఒక పండు, నిమ్మ కాయరసం లేదా జామ కాయను తీసుకోవాలి. ఇవేవి అందుబాటులో ఉండకపోతే ఒక గ్లాసు పాలైనా తాగాలి. మధ్యాహ్నం భోజనంలో 75 గ్రాముల గింజ ధాన్యాలు, ఆకు కూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు 50 గ్రాముల గింజ ధాన్యాలతో చిరుతిండి, ఒక కప్పు పాలు తీసుకోవాలి. రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా రెండు చపాతీలు లేదా పుల్కాలు కూర గాయలతో తినాలి. ఒక వేళ కూర గాయలు, పెరుగు వద్దను కున్నప్పుడు 100 గ్రాముల మాంసాహారం ఉండాలి.

నీరు, పాలకు ప్రాధాన్యం ఇవ్వాలి..

పరిశుభ్రమైన నీటినే తాగాలి. సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలు దూరమవుతాయి. ఎక్కువగా కాచి వడబోసిన నీటినే తీసుకోవాలి. నీటితో పాటు పాలు కూడా చాలా అవసరం. రోజుకు 250 మిల్లీ లీటర్ల పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్న వారు రోజుకు ఇకటి రెండు సార్లు కంటే ఎక్కువ తీసుకోరాదు.

పప్పు ధాన్యాలు..

ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం పప్పు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి రోజూ ఏదో ఒక ఆకుకూర 100 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామ, నిమ్మ, ఉసిరి ఏదో ఒక దానిని తప్పకుండా తీసుకోవాలి. రోజు విడిచి రోజు ఉడికించిన గుడ్డు, వారంలో ఒకసారి చికెన్ లేదా మటన్ తీసుకోవాలి.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం

ఆహారం బాగా ఉడికించి తినాలి. ఏ, సీ, డీ, కే విటమిన్లు కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు. అంధత్వంతో పాటు పిల్లల్లో వాంతులు, విరేచనాలు, తట్టు, శ్వాసకోశ సంబంధ వ్యాధులను నివారించేందుకు ఏ విటమిన్ బాగా పనిచేస్తుంది. తోటకూర, మెంతికూర, పాలకూర, క్యారెట్, కెరోటిన్ ఉన్న మునగాకు, మామిడి, బొప్పాయి, గుమ్మడి వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి సరిపడ విటమిన్లు అందుతాయి.

తాజా కూరలు, పండ్లు..

- ప్రతిపూట భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. పరిశుభ్రమైన ఆహారం, కాచి వడబోసిన నీటిని తీసుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు.
- ఆహారాన్ని ఒకేసారి కాకుండా కొంచెం కొంచెం ప్రతి మూడు గంటలకు ఒకసారి తీసుకోవడం ఉత్తమం.
- రోజు వారి ఆహారంలో తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. పండ్లలో ఉండే సూక్ష్మ పోషక పదార్థాలు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.

గ్రంథావిష్కరణ

చిక్కడపల్లి: సాహిత్య, సాంస్కృతిక , సామాజిక వికాస సంస్థ తెలుగు రథం ఆధ్వర్యంలో కోటిపల్ల సుబ్బారావు రచించిన శకునశాస్త్ర సర్వస్వము శకునాలు–వాటి ఫలితాలు గ్రంథావిష్కరణ గురువారం రాత్రి గుండవరపు హనుమంతరావు కళావేదికలో జరిగింది. జ్యోతిష పండితుడు దైవజ్ఞ సోమంచి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

తొర్రూరు ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

కవాడిగూడ: పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్ఎస్సీరెడ్డిని ప్రశ్నించినందుకు ఆమ్‌ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు మాలోతు సురేష్‌పై తొర్రూర్ ఎస్సై ఇష్టానుసారంగా కొట్టినందుకు ఎస్సైపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై నేడు ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర ప్రతినిధి బృందం రాష్ట్ర డీజీపీని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రైల్లో ల్యాప్‌టాప్ చోరీ

కాచిగూడ: రైల్లో ల్యాప్‌టాప్ చోరీ జరిగిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన మేరకు.. ఈసీఐఎల్ ప్రాంతానికి చెందిన ప్రవీణ్‌కుమార్ బెంగుళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి యశ్వంత్‌పూర్ – కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైల్లో కాచిగూడకు వస్తున్నాడు. ల్యాప్‌టాప్‌ను సీట్లో పెట్టి బాత్‌రూమ్‌కు వెళ్లి వచ్చేసరికి ల్యాప్‌టాప్ చోరీ జరిగింది. దీంతో గురువారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓయూ క్యాంపస్‌లో ప్రశాంతం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో పోలీసుల పహారాతో గురువారం ప్రశాంత వాతావరణం నెలకొంది. డీఎస్సీ పరీక్ష వాయిదా కోసం అభ్యర్థులు చేసిన ఆందోళనలతో నాలుగు రోజులుగా అట్టుడికిన ఓయూ క్యాంపస్ హాల్‌టిక్కెట్ల జారీతో అభ్యర్థులు వెనక్కు తగ్గారు. ఓయూలో జర్నలిస్టులపై జరిగిన దాడిని ఏఐఎస్ఎఫ్ నాయకుడు నెల్లి సత్య ఖండించారు. నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్న కొన్ని యూట్యూబ్ ఛానళ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఓయూ పీహెచ్‌డీ స్కాలర్ వలిగొండ నరసింహ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ కార్మికులకు జీతాలివ్వాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, జీవో 60 ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచాలని, జీవో 51ని రద్దు చేసి కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలిన తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం హిమాయత్ నగర్‌లోని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ముందు బైఠాయించి కార్మికులతో కలిసి యూనియన్ నాయకులు ధర్నా చేపట్టారు.

మూసీ సుందరీకరణ పేరుతో ఇళ్లను తొలగించవద్దు



బస్తీ బాట కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేత ఎం.మహేందర్

కాచిగూడ: మూసీ ప్రక్షాళనలో భాగంగా సుందరీకరణ పేరుతో ఇండ్లు తొలగించవద్దని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మహేందర్ డిమాండ్ చేశారు. సీపీఎం బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా గురువరం కాచిగూడ, కృష్ణానగర్ బస్తీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న ఇళ్లను కూల్చివేసి నగరానికి 30 కిలో మీటర్ల దూరంకు పంపించాలని అధికారులు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని అన్నారు. మురికివాడ బస్తీల్లో నివసిస్తున్న చిన్నచిన్న ఇళ్లను కూల్చివేసి సిటి బయటకు పంపించడం ప్రభుత్వం తీసుకున్న దారుణమైన చర్యని అన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తవుతున్న ఇంతవరకు ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ రూ.500 అమలు కావడం లేదని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు జి.రాములు, షబానా, వరలక్ష్మీ, లలిత, జానార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన మేకపోతుల నరేందర్ గౌడ్

కాచిగూడ: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అర్హులైన బీసీ విద్యార్థులందరికి ప్రభుత్వమే పూర్తి ఫీజులు చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 4 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ.5వేల కోట్లకు పైగా పేరుకుపోయి ఉన్నాయని తెలిపారు. బకాయిలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో విద్యా సంస్థలకు అందజేయకపోవడం వల్ల ప్రస్తుతం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

బీసీలు సంఘటితంగా పోరాడాలి

కాచిగూడ: తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారత సంఘం గ్రేటర్ హైదరాబాద్ గౌరవ అధ్యక్షులుగా ఆర్.వి.మహేందర్ కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు మహేందర్ కుమార్‌కు గురువారం సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య, అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్, తెలుగు రాష్ట్రాల కౌన్సిల్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కర్ రావు లు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బర్కత్‌పుర లోని తన కార్యాలయంలో మహేందర్ కుమార్ మాట్లాడుతూ బీసీలు రాజ్యాధికారం కోసం సంఘటితంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ఆర్‌వి మహేందర్ కుమార్‌కు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ కొండ దేవయ్య

కనీస వేతనాలపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.చంద్రశేఖర్, జనక్‌ప్రసాద్ తదితరులు

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో గురువారం కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆధ్వర్యంలో కనీసవేతనాలపై ఐఎల్‌ఓ కోర్డినేషన్ కమిటీతో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహాల మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్, అదనపు కమిషనర్ ఈ.గంగాధర్, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో ప్రభుత్వం కార్మికుల శ్రేయస్సు కోసం దేశంలోనే మొదటి సారి ఐఎల్‌ఓ సూచనలు తీసుకొని వాటిపై సమగ్రమైన నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

ఓయూ ఇంజినీరింగ్ విద్యార్థుల పేటెంట్ పరీక్షకు ఎంపిక

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 10 మంది విద్యార్థులు పేటెంట్, డిజైన్ పరీక్షకు (గ్రూప్–ఏ) ఎంపికైనట్లు అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం పేటెంట్ కార్యాలయంలో విద్యార్థులను ఎంపిక చేసినట్లు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో 53 ఖాళీలకుగాను అందులో 10 మంది ఓయూ విద్యార్థులు ఉండడం విశేషం.

చేపల మార్కెట్‌ను అభివృద్ధి చేయాలి



రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి గంగపుత్రను కలిసి సన్మానిస్తున్న యశ్వంత్

కాచిగూడ: అంబర్‌పేటలో చేపల మార్కెట్ అభివృద్ధి కోసం కృషి చేయాలని గంగపుత్ర సంఘం యువ నేత ఎ.యశ్వంత్ ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి గంగపుత్రను కలిసి విజ్ఞప్తి చేశారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉదయ్, కిరణ్, ప్రణీత్ కుమార్, నాస ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజికంగా.. ఆర్థికంగా ఎదగాలి

కాచిగూడ: పద్మశాలీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రయత్నించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి అధ్యక్షతన గురువారం నారాయణగూడ పద్మశాలి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడంతో పాటు అట్టడుగున ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం యువజన విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా చిన్ని రాకేష్ నేతను నియమిస్తూ వారు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిన్ని రాకేష్ నేత మాట్లాడుతూ పద్మశాలి యువతను సంఘటితం చేసి సంఘ అభివృద్ధికి, పద్మశాలీల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అవ్వారి భాస్కర్, మాచర్ల రామచందర్ రావు, బొమ్మ అమరేందర్, బొల్ల శివ శంకర్ పాల్గొన్నారు.

దళిత బహుజన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేందర్ రావు



నక్కా రాజేందర్ రావు

కాచిగూడ: దళిత బహుజన పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నక్కా రాజేందర్ రావును నియమిస్తూ పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వడ్లమూరి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం వివిధ స్థాయిల్లో ఉద్యమం చేసి బాధితుల పక్షాన నిలబడినందుకు రాజేందర్ రావుకు పార్టీలో సముచిత గుర్తింపు ఇచ్చామన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానంతో తెలంగాణలో దళిత బహుజనుల రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని సూచించారు.

విచ్చలవిడిగా ఉన్న పర్మిట్ రూమ్‌లను అరికట్టాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విచ్చలవిడిగా ఉన్న పర్మిట్ రూమ్‌లను, బెల్ట్ షాపులను అరికట్టాలని తెలంగాణ రాష్ట్ర బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైన్ షాపుల్లో పర్మిట్ రూమ్‌లతో బార్ యజమానులు తీవ్ర నష్టాల్లోకి వెళుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బార్లలో తాము 30 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించి వారికి జీవనోపాధి కల్పిస్తున్నామని తెలిపారు. నష్టాలలో ఉన్న బార్ల యజమానులను ప్రభుత్వం అర్థం చేసుకుని ఆదుకోవాలని ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి సానుకూలంగా స్పందించాలని కోరారు. సమావేశంలో సుధాకర్ గౌడ్, పి.రాజు గౌడ్, జి.విజయకుమార్ గౌడ్, ఎ.రామకృష్ణ, రాజుగౌడ్ పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

యువతకు యాంటీ నార్కోటిక్ ఎస్పీ సీతారాం పిలుపు



నో డ్రగ్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సీతారం, సేన ప్రతినిధులు

హిమాయత్‌నగర్: మత్తు పదార్థాలకు బానిసై యువత జీవితాలను కోల్పోతున్నారని తెలంగాణ యాంటీ నార్కోటిక్ ఎస్పీ సీతారాం అన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ నవ నిర్మాణ్ విద్యార్థి సేన ఆధ్వర్యంలో 'డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ–యంగ్ సైరన్'కార్యక్రమం పేరిట సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీతారాం 'నో డ్రగ్స్'వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల జరిగే దుష్పరిణామాల గురించి కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సేన వ్యవస్థాపక అధ్యక్షుడు శివప్రసాద్, శంషాబాద్ ఏసీపీ కేఎస్ రావు, ఏసీపీ సుబ్బిరామిరెడ్డి పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్'పైఅవగాహన అవసరం

హిమాయత్‌నగర్: పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోడీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని తీసుకువచ్చారని, కానీ అందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఆరోపించారు. ఆయుష్మాన్ భారత్ పథకం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమలయ్యే ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల వద్ద అవగాహ కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై ప్రధాని మోడీ పీఎంవో గ్రీవియన్స్‌కు సందేశం పంపించానని, వెంటనే స్పందించిన అధికారులు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. పథకాన్ని అన్ని స్థాయిలలో అన్ని ఆస్పత్రులలో ప్రవేశపెట్టాలని శ్రీధర్ పీఎంఓ కార్యాలయానికి లేఖ రాశారు. దీంతో పీఎంఓ ఆ సలహాకు స్పందించడం ఆనందంగా ఉందన్నారు.